క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న రాజశేఖరరెడ్డి

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి గ్రామంలో దాతలు, గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న కరావులీశ్వర దేవాలయ నిర్మాణం కోసం మేరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వనం రాజశేఖరరెడ్డి 1,01,016 విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు శంకరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖరరెడ్డిని అభినందించారు.

తహసీల్దార్‌కు వినతి

రొద్దం: మతం మారిన క్రిస్టియన్లను బీసీ (సీ) కింద మాత్రమే గుర్తించాలంటూ స్థానిక బీజేపీ నాయకులు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీరుగంటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, గంగాధరప్ప, మహదేవ, మోహన్, రాజు, ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో దొంగతనం



బీరువా పగల గొట్టిన దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని దుర్గా నగర్‌లో నివాసముంటున్న వెంకటేష్ నివాసంలో చోరీ జరిగింది. ఆదివారం తన భార్య నిర్మలతో కలిసి పెనుకొండ మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వారు వెళ్లారు. అయితే సోమవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా అప్పటికే తాళాలు తీసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రూ.6 వేల నగదు, వెండి ఆభరణాలు, గ్యాస్ సిలిండర్‌తో పాటు పట్టు చీరలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్‌ఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ప్రతిమ (43) అనే మహిళ సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసున్నట్లు ఏఎస్‌ఐ ధనుంజయ తెలిపారు. మృతురాలి భర్త నరేంద్ర తెలిపిన వివరాలమేరకు... ప్రతిమ కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని, వివిధ ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదన్నారు. దీంతో మనోవేదనకు గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యం ధ్వంసం




మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెనుకొండ రూరల్: కియా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ, సెబ్ సీఐ వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. మొత్తం 70 కేసుల కర్ణాటక మద్యంతో పాటు మన రాష్ట్రానికి చెందిన రెండు కేసుల మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశామన్నారు. ఈ మద్యం విలువ రూ. 2,69,500 ఉంటుందని చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ 44వ నెంబరు జాతీయ రహదారి మొరంపల్లి క్రాస్‌లో సోమవారం 267 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. బాగేపల్లికి చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, బైక్ సీజ్ చేశామన్నారు.

చెక్ పోస్టుల్లో గట్టి నిఘా



వాహనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక విధాన సభ ఎన్నికల నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. రాజవంతి, కొడమడుగు, నాగలాపుర, దొమ్మతమరి, ఆరసికెర (చిక్కనదకు క్రాస్), వెంకటమ్మనహళ్లి చెక్‌పోస్టులను ఏర్పాటు చేయగా తిరుమణి సీఐ కాంతరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పుచ్చ సాగు.. లాభాలు బాగు

- వేసవి కావడంతో మంచి డిమాండ్
- పెట్టుబడి పోను లాభం బాగుందంటున్న రైతులు



కాయను చూపుతున్న రైతు వెంకటేష్



రెడ్డిపల్లిలో పుచ్చకాయ పంట సాగు చేస్తున్న దృశ్యం

విరగ్గాసిన పుచ్చకాయలు

రొద్దం: వేసవి కాలంలో పుచ్చకాయకు ఎక్కడా లేని డిమాండ్ ఉంటుంది. ఈ సీజన్‌లో నగరాల్లో అయితే వ్యాపారస్తులు కేజీ రూ.25 నుంచి రూ.30 దాకా విక్రయిస్తుంటారు. ఒక్కో కాయను విక్రయించే వారు మాత్రం సైజును బట్టి దాదాపు రూ.100కు పైగానే అమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు కూడా పుచ్చకాయలను సాగు చేసి లాభాలను గడిస్తున్నారు.

పెనుకొండ డివిజన్‌లో నాలుగు హెక్టార్లు, మడకశిర పరిధిలో మూడు ఎకరాల్లో రైతులు పుచ్చకాయల సాగులో ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రొద్దం మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే రైతు దాదాపు మూడు ఎకరాల్లో పుచ్చకాయలను సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రతి ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ ఈ ఏడాది తన బోరుబావు కింద దాదాపు మూడు ఎకరాల భూమిలో పుచ్చకాయల సాగుకు శ్రీకారం చుట్టారు. మూడు ఎకరాల్లో పంట సాగుకు దాదాపు రూ. 2 లక్షలు ఖర్చు పెట్టాడు. పంట కోతకు రావడంతో మార్కెట్లో ఇప్పుడున్న ధరలతో ఖర్చులు పోనూ రూ. 3 లక్షల దాకా ఆదాయం వచ్చిందని రైతు వెంకటేష్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 50 టన్నులు పంట దిగుబడి వచ్చిందన్నారు. తాను సాగు కోసం ఖర్చుపెట్టిన పెట్టుబడి ఒక కోతలోనే వచ్చిందని పేర్కొన్నారు. ఒక్కో కాయ 5 కేజీల నుంచి 6 కేజీలు దిగుబడి వచ్చిందని చెప్పారు. ఎరువులు, విత్తనాలు, కూలీలు, సేద్యం ఖర్చులు మొత్తం రూ. 2 లక్షలు దాకా వచ్చిందన్నారు. డ్రిప్ ఏర్పాటు చేయడంతో నీరు పంటకు నీళ్లు బాగా అందాయని, అందువల్లే పంట బాగా దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులు పుచ్చకాయల సాగుపై ప్రత్యేక దృష్టి పెడితే నష్టపోకుండా లాభాల బాట పట్టొచ్చని రైతు వెంకటేష్ చెబుతున్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని ఎమ్మెల్యే తిప్పేస్వామి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం విజయవాడ నుంచి ఫోన్‌లో 'సాక్షి'తో మాట్లాడారు. ఓ మీడియా సంస్థ తనపై దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. తనకు వ్యతిరేకంగా కొంతమంది కుట్ర పన్ని ఇలాంటి దుష్ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. పార్టీలో గందరగోళం సృష్టించడానికి ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీని బలహీనపరచడానికి ఇలాంటి కుట్రకు తెరతీశారని మండిపడ్డారు. తన పరువు, ప్రతిష్టకు భంగం కలిగించిన మీడియా సంస్థకు లీగల్ నోటీసులు ఇస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిప్పికొట్టాలని సూచించారు. మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉందన్నారు. 66 సర్పంచ్ స్థానాల్లో 56 సర్పంచు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలిచారని, అలాగే 69 ఎంపీటీసీ స్థానాల్లో కూడా 60 స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుందన్నారు. నియోజకవర్గంలో చాలా బలంగా ఉన్న పార్టీని దెబ్బతీయడానికి గిట్టని వారు ఇలాంటి కుట్రలు చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



పరిగి: ముల్లమోతుకపల్లిలో జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిర: జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ముల్లమోతుకపల్లిలో సోమవారం జ్యోతుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మండల వైస్ ఎంపీపీ వేదవతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ దేవాలయానికి జ్యోతులు మోశారు. ప్రత్యేకంగా అలంకరించిన జ్యోతులతో మహిళలు ఉత్సవానికి సిద్ధంకాగా... మేళ తాళాలు, దప్పుల నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీరామ దేవాలయంలో జ్యోతులను సమర్పించారు. రెండు రోజుల వేడుకలో భాగంగా మంగళవారం స్థానిక ముత్యాలమ్మ అమ్మవారికి జ్యోతులు సమర్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. జ్యోతుల ఉత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది.

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, రంగనాథస్వామి వార్లకు సోమవారం భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలను నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులను మోసుకొని ఊరేగింపుగా దేవాలయాల వద్దకు తీసుకెళ్లి స్వామి వార్లకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కనుమ మారెమ్మకు ...

మండలంలోని గౌడనహళ్లి గ్రామ ప్రజలు మంగళవారం కనుమ మారెమ్మకు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించనున్న గ్రామ పెద్దలు తెలిపారు. దాదాపు 16 ఏళ్ల తర్వాత కనుమ మారెమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామం మధ్యలో అమ్మవారిని కుర్చోబెట్టి ఘనంగా జ్యోతుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా అచ్చంపల్లి గ్రామంలో ఊరి మారెమ్మకు జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా జలధి ఉత్సవం



వలసలో మారెమ్మదేవి జలధి ఉత్సవానికి హాజరైన భక్తులు



పుల్లీకుంటలో దుర్గమ్మదేవిని జలధి ఉత్సవానికి తరలిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని వలస, పుల్లీకుంట, హాలుకూరు గ్రామాల్లో వెలసిన మారెమ్మ, దుర్గమ్మ, కరియమ్మ జలధి ఉత్సవాలను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వెలసిన దేవతమూర్తుల ఉత్సవ విగ్రహాలను మేళా తాళాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా గ్రామ పొలిమేరలో ఉన్న వంక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవార్ల విగ్రహాలను తిరిగి ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకొచ్చారు. వలసలో చావిడి వద్ద కూర్చోబెట్టి ప్రత్యేకంగా సాయంత్రంకు వరకు పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయాల్లోకి మారెమ్మ, దుర్గమ్మ, కరియమ్మల ఉత్సవ విగ్రహాలను యథావిధిగా ప్రతిష్టించారు.

నేడు హారతి ఉత్సవం

మండలంలోని వలస, పుల్లీకుంట, హాలుకూరు గ్రామాల్లో మారెమ్మ, దుర్గమ్మ, కరియమ్మ దేవతలకు హారతి ఉత్సవాలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్ నుంచి జేడీఎస్‌లో చేరిక

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి గ్రామ పంచాయతీ పరిధిలోని గుమ్మఘట్ట గ్రామంలో 30 మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సోమవారం జేడీఎస్ పార్టీలో చేరారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే, జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సి అంజినప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, బలరామరెడ్డి, రాజశేఖర్, ఎస్‌ఏ ఈరణ్ణ, ఎస్ కే రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పకు ఓటేసి గెలిపించాలని ఆర్సి అంజినప్ప గ్రామస్తులను కోరారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అమరాపురానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ కోఆర్డినేటర్ శివరాజ్‌యాదవ్ అసభ్యకరమైన, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగానే శివరాజ్‌యాదవ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు సోమవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు త్రిలోక్‌నాథ్, రంజిత్‌కుమార్, ప్రసాద్, తిప్పయ్య, పీఆర్.మూర్తి, నారాయణ, మంజునాథ, శివకుమార్ పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ పరీక్షలో ప్రతిభ

హిందూపురం టౌన్: స్థానిక జ్ఞాన జ్యోతి పాఠశాలలో సోమవారం కరాటే ఎల్లో బెల్ట్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులు కరాటే బెల్ట్ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. కరాటే కోచ్ చంద్రశేఖర్ విద్యార్థులకు కరాటే బెల్టుతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలి

అమరాపురం: పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హాలుకూరు సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఎగ్ కర్రీ వండాల్సి ఉండగా చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మడకశిర: చిరుధాన్యాలను భుజించడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. నియోజకవర్గంలో మార్చి 20 నుంచి 15 రోజుల పాటు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడాపై పక్షోత్సవాలను నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాల ఉపయోగాలను వివరించారు. గుడిబండ సీడీపీఓ పద్మావతి, అధ్యాపకులు కృష్ణానాయక్, అనిల్ కుమార్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



జగనన్నే మా భవిష్యత్ అంటూ కరపత్రాలు చూపిస్తున్న నాయకులు

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర యాదవ్ కోరారు. సోమవారం బుళ్లసముద్రం, గోవిందాపురం, జీవీపాళ్యం పంచాయతీల్లో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలతో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు .. తప్పిన ప్రమాదం



రత్నగిరిలో బంకు మీద కూలిన చెట్టు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయ సమీపంలో ఏళ్ల నాటి జువ్వి చెట్టు సోమవారం తెల్లవారుజామున కూలింది. ఆలయంలో పక్కనే జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. జువ్వి చెట్టు పక్కనే అడవీష్ అనే వ్యక్తి బంకు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకొనేవారు. అయితే చెట్టు కొమ్మలు బంకుపై విరిగి పడటంతో బంకు పూర్తిగా దెబ్బంది. దీంతో రూ.1.80 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయారు. అలాగే ప్రకాష్, దేవరాజు చెందిన బంకులుపైనా కూడా జువ్వి చెట్టు కొమ్మలు విరిగి పడటంతో స్వల్పంగా దెబ్బ తిన్నాయన్నారు. దీంతో పాటు బ్రహ్మోత్సవాల్లో వ్యాపారం కోసం చిన్న చిన్నగా ఏర్పాటు చేసుకున్న అంగళ్లపైన కూడా చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. జేసీబీ సహాయంతో బంకు మీద పడిన కొమ్మలను తొలగించారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి



వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ బి.నవీన్‌నిశ్చల్

చిలమత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ బి.నవీన్‌నిశ్చల్ అన్నారు. సోమవారం ఆయన చిలమత్తూరు మండల కేంద్రంలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మండల పరిధిలోని పలగలపల్లి పంచాయతీలోని బందేపల్లిలో పర్యటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని కొనియాడారు. హిందూపురం నియోజకవర్గ ప్రజలు చుట్టపుచూపుగా వచ్చే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను నమ్మవద్దని సూచించారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్లు ఎం.లక్ష్మీనారాయణ, సదాశివరెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన 'పది' పరీక్షలు



హిందూపురం: ఎంజీఎం కేంద్రం వద్ద రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



గోరంట్ల: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిసున్న తహసీల్దార్ రంగనాయకులు

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

మడకశిర: నియోజకవర్గంలో తొలిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5 మండలాల్లో ఏర్పాటు చేసిన మొత్తం 17 కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది రాకుండా పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం 3,054 మంది విద్యార్థులకు గాను 3,015 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 39 విద్యార్థులు గైర్హాజరయ్యారు. మడకశిరలోని 7 కేంద్రాల్లో 1,106 మందికి గాను 1,091 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. అమరాపురంలోని 3 కేంద్రాల్లో 629 మందికి గాను 617 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు. గుడిబండలోని 3 కేంద్రాల్లో 540 మందికి గాను 531 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. అగళిలోని 2 కేంద్రాల్లో 323 మందికి గాను 321 మంది హాజరయ్యారు. ఇద్దరు హాజరు కాలేదు. రొళ్లలోని 2 కేంద్రాల్లో 456 మందికిగాను 454 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరకాలేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

హిందూపురం: నియోజకవర్గ వ్యాప్తంగా పదో తరగతి పరీక్షాలు మొదటిరోజు సోమవారం పకడ్బందీగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, బంధువులు పరీక్ష కేంద్రాల వద్దకు పిల్లలతో చేరుకున్నారు. హాల్‌టిక్కెట్లు ఉన్న విద్యార్థులను పరిశీలించి అధికారులు సెంటర్లలోకి అనుమతించారు. నియోజకవర్గంలో 25 సెంటర్లలో మొత్తం 6,427 మంది విద్యార్థులకుగాను 6,359 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. 68 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలో 3,380 మందికి గాను 3351 మంది పరీక్ష రాశారు. 29 మంది గైర్హాజరయ్యారు. హిందూపురం మండలంలో 1808 మందికిగాను 1786 మంది పరీక్ష రాశారు. 22 మంది పరీక్షకు హాజరుకాలేదు. లేపాక్షిలో 771 మందికిగాను 761 మంది పరీక్షకు హాజరయ్యారు. 10 మంది గైర్హాజరయ్యారు. చిలమత్తూరులో 468 మందికి గాను 461 మంది పరీక్షకు హాజరు కాగా 7 మంది పరీక్ష రాయలేదు. సిట్టింగ్ స్క్వాడ్ లేపాక్షి, హిందూపురం ప్రాంతాల్లో పరిశీలించారు.



రొద్దం: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థినులు

పెనుకొండ: నియోజకవర్గంలో సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు సజావుగా సాగాయి. పెనుకొండలో 760 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిఉండగా 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరిగి మండలంలో 209 మంది విద్యార్థులకు గాను 205 మంది పరీక్షలకు హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. సేవామందిర్‌లో 180 మంది విద్యార్థులకుగాను 179 మంది పరీక్షలకు హాజరయ్యారు. కొడిగెనహళ్లిలో 151 మంది విద్యార్థులకుగాను 150 మంది హాజరుకాగా ఒక్కరు గైర్హాజరయ్యారు. అమర్ విద్యామందిర్‌లో 147 మంది విద్యార్థులకు 146 మంది పరీక్షలకు హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారు. గోరంట్ల మండలంలో 1250 మంది విద్యార్థులకుగాను గోరంట్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, గుమ్మయ్యగారిపల్లి, ఇతర పాఠశాలలకు సంబంధించి విద్యార్థులు పరీక్షలు రాశారు. సోమందేపల్లి మండలంలో 585 మంది విద్యార్థులకుగాను 580 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. రొద్దం మండలంలో 551 మంది విద్యార్థులకుగాను 544 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల పట్టణములో సోమవారం జరిగిన 10 వ తరగతి పరీక్షలు సజావుగా సాగాయి. ఇందులో భాగంగానే పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ రంగనాయకులు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో మౌళిక వసతులు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రధానోపాధ్యయులకు ఆయన సూచించారు. ఇదిలా ఉండగా డివిజినల్ విద్యాశాఖ అధికారి రంగస్వామి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు సెంటర్లు, కేజీబీవీలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తనిఖీ చేశారు. సెంటర్ల వద్ద తాగునీరు, వైద్య శిబిరాలను వారు పరిశీలించారు.